సమయపాలన ఏది ?

- 12 దాటినా తెరుచుకోని మండల విద్యావనరుల కేంద్రం
- మధ్యాహ్నమే పశువుల దవాఖానకు తాళం

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 10 : మండలంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం మధ్యాహ్నం 12 గంటల వరకూ తెరుచుకోలేదు. కంప్యూటర్ ఆపరేటర్ అమల 12:30 గంటలకు కార్యాలయానికి రాగా తాళం వేసి ఉంది. దీంతో చేసేది ఏమి లేక సీఆర్పీ రమేశ్‌కు ఫోన్ చేసి తాళంచెవి తీసుకురావాలని చెప్పడంతో కొద్దిసేపటి తర్వాత తలుపులు తీశారు. ఇది ఇలా ఉంటే పశు వైద్యశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉండాలి. అలా కాకుండా మధ్యాహ్నం 12 గంటలకే తాళం వేయడం కనిపించింది. సమయపాలన పాటించని ఉద్యోగులపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తాళం వేయడంతో 12:30 గంటలకు బయటే ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ అమల

12న గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్స్

ములుగురూరల్ /చిట్యాల, సెప్టెంబర్ 10 : ములుగు, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలోని బాలబాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 12న 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు జాకారం గురుకుల ప్రిన్సిపాల్, డీసీవో డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, భూపాలపల్లి గురుకులాల సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కులం, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో మడికొండలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే అడ్మిషన్‌కు తల్లిదండ్రులు తీసుకొని వెళ్లాలని సూచించారు. వివరాలకు 9949892426,7680916134లను సంప్రదించాలని సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 10 : వరంగల్ జిల్లా మామునూరు, కరీంనగర్ జిల్లా చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎం రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు www.navodaya.gov.in ద్వారా ఈ నెల 16 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన తహసీల్దార్

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 10 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని తహసీల్దార్ సునీత మంగళవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల్లో నాణ్యతా లోపాలు గుర్తించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు అందజేసే ఆహార పదార్థాల్లో నిబంధనలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆమె మందలించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు.

భూపాలపల్లి రూరల్ : ఐలమ్మ చిత్రపటం వద్ద ఎమ్మెల్యే జీఎస్ఆర్, కలెక్టర్ రాహుల్‌శర్మ

ములుగు రూరల్ : నివాళులర్పిస్తున్న అధికారులు, రజక సంఘం నాయకులు

చాకలి ఐలమ్మ భావితరాలకు స్ఫూర్తి

- వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జీఎస్ఆర్, కలెక్టర్ రాహుల్‌శర్మ
- ములుగు, జయశంకర్ జిల్లాల్లో ఘన నివాళులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ భావితరాలకు స్ఫూర్తి ప్రధాతని ఎమ్మెల్యే సత్యనారాయణరావు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఇరు జిల్లాల్లో మంగళవారం ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాలను రజక, ఇతర సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలు వేసి నిజాంపై ఆమె చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే జీఎస్ఆర్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఐలమ్మ ఆనాడు చేసిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని అన్నారు. నేటితరం చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి శైలజ పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి ఐలమ్మకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, మైనింగ్ ఏడీ జయరాజు, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సారంగపాణి, జిల్లా అధ్యక్షుడు నేరేండ్ల శంకర్, పట్టణ అధ్యక్షుడు రవి, ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు నాగేశ్వర్‌రావు, సంజీవయ్య పాల్గొన్నారు.

ఏజెన్సీలో విజృంభిస్తున్న విష జ్వరాలు

రోగులతో రద్దీగా మారిన వాజేడు పీహెచ్‌సీ

వాజేడు, సెప్టెంబర్ 10 : వాజేడు ఏజెన్సీలో విష జ్వరాలు విజృంబిస్తున్నాయి. దీంతో స్థానిక పల్లె దవాఖానలు, పీహెచ్‌సీలకు వచ్చి వైద్యం పొందుతున్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీకి మంగళవారం జ్వరాలు, మోకాళ్ల నొప్పులు, కడుపు నొప్పి తదితర సమస్యలతో ప్రజలు తరలివచ్చారు. రోగులతో వైద్యశాల ప్రాంగణం కిక్కిరిసింది. వైద్యాధికారి మధుకర్ రోగులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి మందులు అందజేశారు. వివిధ గ్రామాల నుంచి 152 మంది వచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. రోజురోజుకూ ఓపీ సంఖ్య పెరుగుతున్నదని, ఎక్కువగా జ్వరాలతోనే వస్తున్నారన్నారు.

వైద్యం కోసం క్యూలో ఉన్న రోగులు

వర్షానికి కూలిన ఇంటి గోడలు

ములుగురూరల్, సెప్టెంబర్ 10 : ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న సయ్యద్ ఆజాద్ ఇంటి గోడలు పూర్తిగా కూలిపోయాయి. గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ పరిశీలించారు. ప్రభుత్వం, అధికారులు ఆజాద్‌కు తక్షణ సహాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బైకాని ఓదేలు, ముడుతనపల్లి మోహన్, గడ్డమీద భాస్కర్, డోలి రమేశ్ ఉన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపర్చాలి

చిట్యాల, సెప్టెంబర్ 10 : విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలని ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు జయశంకర్ భూపాలపల్లి అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య సూచించారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ, ఎన్సీఆర్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించేందుకు నవంబర్ 19న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (జాతీయ సాధన పరీక్ష) నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాక్టీస్ పేపర్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. వీటిలో మంగళవారం మొదటి ప్రాక్టీస్ పేపర్‌ను నిర్వహించనున్న మండలంలోని కస్తూర్బా గాంధీ, చిట్యాల జిల్లా పరిషత్ హై స్కూల్, చిట్యాల ప్రాథమిక పాఠశాల పరీక్ష కేంద్రాలను సందర్శించి సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నరేశ్, ఫిజికల్ డైరెక్టర్ సాంబమూర్తి ఉన్నారు.

టేకులగూడెం వద్ద ఎన్‌హెచ్ మూసివేత

ములుగురూరల్, సెప్టెంబర్ 10 : గోదావరి వరద తీవ్రత కారణంగా టేకులగూడెం వద్ద జాతీయ రహదారి 163ను మూసివేసినట్లు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ తెలిపారు. వాజేడు మండలం పేరూరు సమీప టేకులగూడెం వద్ద రేగుమాకు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున వాహనాల రాకపోకలను తాత్కాళికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వెళ్లే వాహనదారులు వయా గుడెప్పాడ్, పరకాల, భూపాలపల్లి, మహదేవపూర్ మీదుగా వెళ్లాలని సూచించారు. కాగా, ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు జంగాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సూచికతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఎన్నిక

ములుగురూరల్, సెప్టెంబర్ 10 : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు యూనియన్లకు అతీతంగా ములుగు జిల్లా జేఏసీని మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా జయరాజు, కార్యదర్శిగా ఆడెపు రాజు, అదనపు కార్యదర్శి సాయిబాబా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆరోగ్యం, కోశాధికారిగా అశోక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఏర్పాటు

వెంకటాపూర్, సెప్టెంబర్ 10 : పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలకేంద్రంలో పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు కోకిల శ్రీరంగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా అడిచెర్ల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొంతల కమలాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా వేల్పుల రమేశ్, కార్యదర్శిగా పోతునూరి రమేశ్, మహిళా ఉపాధ్యాక్షురాలిగా పూర్ణిమను ఎన్నుకున్నారు.

పాపయ్యపల్లిలో వైద్య శిబిరం

వెంకటాపూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 56 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో ఉన్నావారి రక్త నమూనాలు సేకరించారు. డీఎంహెచ్‌వో అల్లం అప్పయ్య వైద్య శిబిరాన్ని పరిశీలించి గ్రామంలోని ఇళ్లను పరిశీలించారు. నీటి నిల్వ చేసే డ్రమ్ములు, గోలాలపై మూతలు పెట్టాలన్నారు. మూడు రోజులకోసారి వాటని శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రణధీర్, డాక్టర్ సంఘమిత్ర, ఏఎన్ఎం స్వర్ణలత పాల్గొన్నారు.

వరిని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని లక్ష్మీదేవిపేటలో వరి పంటను మంగళవారం ఏవో శైలజతో కలిసి డీఏవో సురేశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అక్కడక్కడా ఉల్లికోడు వస్తున్నదని, గొట్టంలాంటి పిలుకలు మొదళ్ల వద్ద ఏర్పడతాయని, ఆకుల తొడిమలు వెండి రంగులోకి మారి కంకులు ఏర్పడొద్దన్నారు. నివారణకు పంట చుట్టూ కీటకాలను ఆకర్షించే పూల మొక్కలు నాటడం సేంద్రియ నియంత్రణగా చేయవచ్చన్నారు. అలాగే క్లోరోఫైరిపాస్ మందు 2.5 మీల్లీ లీటర్లు, థయోమిథాక్సామ్ 03-05 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈవోలు సునీల్, శ్రీనివాస్, డయానా, మహిపవన్, సాయికుమార్, రైతులు ఉన్నారు.

వాజేడు ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

వాజేడు, సెప్టెంబర్ 10 : మండలకేంద్రంలోని ఐటీఐ కళాశాలలో నాల్గో విడుత స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని నేరుగా వచ్చి ప్రవేశం పొందాలని సూచించారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన థాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. థాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం

కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

నాలుగేండ్లు ఏం చేశారు?

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్దుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. న